క్లుప్తంగా

అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు



ఏఓను సన్మానిస్తున్న వ్యవసాయ సిబ్బంది

కోవెలకుంట్ల: ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేసినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని వ్యవసాయ శాఖ కోవెలకుంట్ల ఉప సంచాలకుడు సుధాకర్ అన్నారు. కోవెలకుంట్ల వ్యవసాయాధికారిగా నిరంజన్ ఆరేళ్లపాటు విధులు నిర్వర్తించి ఇటీవల నంద్యాల వ్యవసాయ పరిశోధన కేంద్ర ఏఓగా బదిలీ అయ్యారు. ఈ మేరకు స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం వీడ్కోల సమావేశం ఏర్పాటు చేశారు. కార్యాలయ సిబ్బంది శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల ఏఓ సుధాకర్‌రెడ్డి, టెక్నికల్ ఏఓ నాగేంద్రప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమోహన్, ఏఈఓలు దివ్య, రమణ పాల్గొన్నారు.

పరామర్శ



వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: పట్టణంలోని మౌలాలీ కొండ కాలనీలో నివసిస్తున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ కార్యకర్త ముర్తుజా హుస్సేన్‌ను మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి రవి కుమార్‌రెడ్డి, సాబుజాన్, చాంద్, లియకీత్ తదితరులు ఉన్నారు.

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ



దాణా బస్తాలు అందజేస్తున్న పశువైద్య అధికారులు

డోన్: పశు సంపద అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీతో సమీకృత దాణా సరఫరా చేస్తోందని పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ నాగరాజు తెలిపారు. డోన్ ప్రాంతీయ పశువైద్యశాల ఆవరణలో శుక్రవారం ఆయన రైతులకు సబ్సిడీ దాణా బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 50 కేజీల బస్తా రూ.1110 కాగా, సబ్సిడీ తర్వాత రైతులు కేవలం రూ.555 మాత్రమే చెల్లించి పొందవచ్చునన్నారు. ఈ దాణాలో 20 శాతం మాంస కృతులు ఉండడంతో పాల ఉత్పత్తి రెట్టింపు అయ్యే అవకాశం ఉందన్నారు. దాణా గుళికల రూపంలో అందుబాటులో ఉండడంతో, పశువులకు వేసే గంట ముందు నీటిలో నానబెట్టి ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యులు పద్మావతి, గౌసియాబేగం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మధ్య సరిగెత్తు



కోవెలకుంట్ల: చిన్నబార్‌ఇమాం చావిడిలో ఫాతేహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మొహర్రం వేడుకలను పురస్కరించుకుని బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం మధ్య సరిగెత్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోవెలకుంట్లలోని చిన్నబార్‌ఇమాం, పెద్దబార్‌ఇమాం, ఆంజనేయస్వామి దేవాలయం, రంగరాజుపేట, బాబానగర్, జెండామాను వీధి, సంతపేట, బసిరెడ్డిబావి వీధుల్లో బీబీఫాతిమా, ఇమాంకాశీం, అజరత్ అలీ అక్బర్, చిన్నబార్‌ఇమాం, ఇమాంకాశీం, పెద్ద బార్‌ఇమాం, హజరత్ అబ్బాస్, హజరత్ అలీ అబ్బాస్, దస్తగిరిస్వామి, మస్తాన్‌వలి, ఉద్దండ ఇమాంకాశీం పీర్లను కొలువుంచారు. మండలంలోని గుళ్లదూర్తి, సౌదరదిన్నె, కలుగొట్ల, అమడాల, తదితర గ్రామాల్లో దస్తగిరిస్వామి, మౌలాలిస్వామి, బాదుల్లాస్వామి పీర్లను కొలువుంచి భక్తులు ఫాతేహాలు సమర్పించారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో మధ్య సరిగెత్తు సందర్భంగా పీర్లను ఊరేగించారు. శనివారం పెద్దసరిగెత్తు వేడుకలు జరుగనున్నాయి.

ఫాతెహాల సమర్పణ

బనగానపల్లె: పట్టణంలోని ఆస్థానంలో హజరత్ అబ్బాస్, సాహజాద ఖాసీం అఘూర్ ఖానాలలో మధ్య సరిగెత్తు సందర్భంగా శుక్రవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కాటసాని ప్రసాదరెడ్డి పూలచాదర్లు సమర్పించారు. ఆయన వెంట మైనార్టీ నాయకులు ముక్తియార్, ఖానీక్, లియఖాత్, కలాం ఉన్నారు.

ఉన్నది మూశారు..
కొత్తది మరిచారు





అద్దెకు ఇచ్చిన వాటర్‌ప్లాంట్ గది, గత ప్రభుత్వంలో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ మూసివేసిన దృశ్యం

ఆకుమల్ల గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ మూతపడడంతో గ్రామస్తులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. 2014 ఎన్నికల్లో గెలిచిన బీసీ జనార్దన్ రెడ్డి గ్రామంలో ప్లాంట్ నిర్మిస్తామని ప్రభుత్వ స్థలంలో గదిని నిర్మించి వదిలేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచిన కాటసాని రామిరెడ్డి రూ.5 లక్షలతో నూతన ప్లాంట్ నిర్మించి నీటి కష్టాలను తీర్చారు. అయితే, 2024లో మళ్లీ బీసీ జనార్దన్ రెడ్డి గెలిచి మంత్రి పదవిలోకి వచ్చిన తర్వాత అధికారులు వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మించిన ప్లాంట్‌ను స్వాధీనం చేసుకుని మూతవేశారు. నూతన ప్లాంట్ నిర్మిస్తారా అని గ్రామస్తులు ఆశగా ఎదురుచూస్తున్నారు. 2014లో నిర్మించిన గదిని టీడీపీ నాయకులు అద్దెకు ఇచ్చి స్వలాభం పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవైపు నూతనంగా ఏదీ నిర్మించకుండా, ఉన్న ప్లాంట్‌ను మూసేయడం అన్యాయం అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం ప్రస్తుతం ప్రజలు చుట్టుపక్కల గ్రామాలకు 5 కిలోమీటర్లు వెళ్లాల్సిన దుస్థితి ఎదురవుతోంది. ఉన్నతాధికారులు స్పందించి మినరల్ ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. –సంజామల

పొంగిపొర్లిన డ్రైనేజీ



సంతమార్కెట్ సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. పట్టణంలోని ఆయా కాలనీల్లోని నీరంతా డ్రైనేజీల్లో చేరింది. సంతమార్కెట్ సమీపంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరు కాలనీలోని ఇళ్ల ముందర రోడ్డుపై ప్రవహించింది. ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడ్డారు. –కోవెలకుంట్ల

స్వలాభమే కూటమి నేతల ధ్యేయం



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్: ప్రజాసంక్షేమం, అభివృద్ధి పనులకు మంగళం పాడి అక్రమార్జనే ధ్యేయంగా కూటమి నేతలు పనిచేస్తున్నారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు ఆరోపించారు. డోన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పట్టణ నడిబొడ్డు నుంచి శివారు ప్రాంతానికి తరలించడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ నేతలు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. అన్ని వసతులతో రూ.కోటి వ్యయంతో నిర్మించిన భవనాన్ని కాదని శివారు ప్రాంతంలో టీడీపీ నాయకునికి లబ్ధి చేకూరే విధంగా కార్యాలయాన్ని మార్చాలనుకోవడం టీడీపీ నాయకుల స్వార్థ రాజకీయాలకు నిదర్శనమన్నారు. తిరిగి పట్టణ నడిబొడ్డున కార్యాలయాన్ని ఏర్పాటు చేసే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీక్షలో పార్టీ మండల బూత్‌కమిటీ చైర్మన్ దొరపల్లె చిరంజీవి, బంగారు జయచంద్ర, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల నాగరాజు, కామగానికుంట్ల సర్పంచ్ వేమారెడ్డి, నాయకులు బొబ్బల శివరామిరెడ్డి, షేక్షా, రబ్బాని, వెంగల్‌రెడ్డి, వెంకటనాయునిపల్లె రాజు, భాస్కర్, గేట్‌పైన రాజు, నాగిరెడ్డి, నారాయణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, ఆదాం, వెంకటనాయునిపల్లె రాంకుమార్, రమేష్ ఉన్నారు.



రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

సీపీఐ రాస్తారోకో

డోన్ టౌన్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అనువుకాని ప్రదేశానికి తరలిస్తే ప్రజా ఉద్యమం తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సుంకయ్య హెచ్చరించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపు ఆపాలని కోరుతూ శుక్రవారం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద రాస్తారోకో నిర్వహించారు.

నైపుణ్యం పెంచుకుంటేనే ఉపాధి అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

కోవెలకుంట్ల: విద్యార్థులు తమలో దాగి ఉన్న సృజనాత్మకతా నైపుణ్యాలను వెలికి తీసి ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూత్‌ఫర్ సోషల్ ఇంపాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో విద్యార్థులు పేరును ఏ విధంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి, నిపుణుల సాయం ఎలా తీసుకోవాలన్న అంశాలను వివరించారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగం కోసమే ఎదురు చూడకుండా ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, కృష్ణశశాంక, లక్ష్మీదేవి, అన్నపూర్ణ, రమణారెడ్డి, నరేంద్రనాథరెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీవీ సుబ్బారెడ్డి సేవలు చిరస్మరణీయం



బీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీవీ నాగార్జునరెడ్డి

కోవెలకుంట్ల: పట్టణానికి చెందిన దివంగత బీవీ సుబ్బారెడ్డి రేనాటిగడ్డ ఖ్యాతిని దేశ నలుమూలలా చాటారని కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి అన్నారు. బీవీ 122వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక పార్కులోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. మద్రాసులో న్యాయవిద్యను పూర్తి చేసి నంద్యాలలో కొంతకాలం న్యాయవాదిగా పనిచేశారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని తన వంతు కృషి చేశారన్నారు. కోవెలకుంట్ల నియోజకవర్గానికి ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా, స్పీకర్‌గా పనిచేశారన్నారు. ప్రకృతి పీఠం అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డి, పంచాయతీ ఇన్‌చార్జ్ ఈఓ ప్రకాష్‌నాయుడు, నాయకులు మహమ్మద్ రఫీ, అహమ్మద్ ఉసేన్, మహేశ్వరరెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

మోస్తరు వర్షానికే పరిమితం



కొలిమిగుండ్లలో కురుస్తున్న తేలిక పాటి వర్షం

కొలిమిగుండ్ల: ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నా మోస్తరు వర్షానికే పరిమితమవుతోంది. శుక్రవారం కొలిమిగుండ్లలో ఓవైపు ఎండ ఉండగానే మరో వైపు తేలిక పాటి వర్షం కురిసింది. రోజు పట్టుమని 10 నిమిషాలు కూడా వర్షం కురవకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఖరీఫ్‌లో వర్షాధారం కింద చాలా మంది రైతులు పత్తి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేశారు. తీరా వరుణుడు కరుణించకపోవడంతో ఆందోళనలో ఉన్నారు. గాలులు కూడా అధికంగా వీస్తున్నాయి. ఉన్న పదును ఆరిపోతుందని వాపోతున్నారు. వ్యవసాయ బోర్లలో నానాటికి భూగర్భ జలాలు పాతాళానికి చేరుతున్నాయి. ఉద్యాన పంటలతో పాటు ఇతర పంటలు సాగు చేసిన రైతులు ఆందోళనలో పడ్డారు. భారీ వర్షాలు కురిస్తే తప్ప భూగర్భ జలాలు పెరగవని రైతులు పేర్కొన్నారు.

అవుకులో మోస్తరు వర్షం

అవుకు: మండలంలో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. నెల రోజులుగా వర్షం జాడేలేదు. రైతులు పంటలు సాగు చేసుకునేందుకు సమాయత్తం అవుతున్న సమయంలో ఈ వర్షం కాస్త ఊరటనిచ్చినా వర్షాలు సకాలంలో కురవకపోతే పంటలు సాగు చేసుకోలేమని రైతులు అంటున్నారు.

శిలాఫలకం ధ్వంసం



ధ్వంసం చేసిన శిలాఫలకం

బేతంచెర్ల: పట్టణంలోని అయ్యల చెరువు వినాయక ఘాట్ సమీపంలో ఏర్పాటు చేసిన నాల్గులైన్ల రహదారి శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం తీవ్ర కలకలం రేపుతోంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో రూ.19.20 కోట్ల వ్యయంతో చేపట్టిన రహదారికి సంబంధించిన శిలాఫలకాన్ని 2023 నవంబర్ 6న ఆవిష్కరించారు. ఈ నాల్గులైన్ల రహదారి ద్వారా కర్నూలు రోడ్డులోని వరద ప్రభావానికి లోనవుతున్న అయ్యల చెరువు వినాయక ఘాట్ వద్ద బ్రిడ్జిల నిర్మాణం, అలాగే హెచ్ కొట్టాల నుంచి బనగానపల్లె రహదారి మీదుగా కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయం వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టారు. దీంతో పట్టణంలో తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలు తీరాయి. అయితే, అభివృద్ధి గుర్తుగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడంపై పట్టణ మేధావులు, ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు దోషులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న మంత్రి బీసీ

సంజామల: ముదిగేడు–సంజామల వరకు రూ.12.58 కోట్లతో జరుగుతున్న రెండు వరుసల రోడ్డు నిర్మాణ పనులను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఇందులో కిలోమీటర్ వరకు విదేశాల్లో వినియోగించే డానిష్ ఫైబర్ రోడ్డు ఏర్పాటుకు డెన్మార్క్ కంపెనీ ముందుకు వచ్చిందన్నారు. మంచి ఫలితం ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు వేయడానికి కృషి చేస్తామని తెలిపారు. చీఫ్ ఇంజినీర్ రామచంద్ర, తహసీల్దార్ అనీల్ కుమార్, ఎంపీడీఓ సాల్మన్ ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శుల వినతి

బనగానపల్లె రూరల్: జిల్లాలోని వివిధ గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బనగానపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. పనివేళలు, పనిఒత్తిడి, సెలవు రోజుల్లో విధులు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కొలిమిగుండ్ల: తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా కొలిమిగుండ్లలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును మంత్రి ప్రారంభించారు. అనంతరం పలు కాలనీల్లో పర్యటించారు. పలుచోట్ల రోడ్లు, నీటి సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని 33/కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏఈ గర్జప్ప శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని టంగుటూరు, సంకలాపురం, కైప, అప్పలాపురం, విశలాపురం గ్రామాల రైతులు సహకరించాలని కోరారు. అలాగే రైతులకు సరఫరా చేసే త్రీఫేస్ విద్యుత్ ఉదయం 4 నుంచి 9 గంటలకు మళ్లీ మధ్యాహ్నం నుంచి సరఫరా చేస్తామని వివరించారు.

- **డోన్ టౌన్:** స్థానిక 132 కేవీ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతు పనుల కారణంగా డోన్, యు.కొత్తపల్లె, మల్యాల, దేవరబండ, పేరంటాలమ్మ గుడి, మల్కాపురం, జగదుర్తి సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈఈ కమలాకర్‌రావు తెలిపారు. అలాగే బేతంచెర్ల మండలంలోని రంగాపురం, గూటుపల్లె సబ్‌స్టేషన్లకు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 5 నుంచి 8 గంటల వరకు మళ్లీ 11 గంటల తర్వాత ఇస్తామన్నారు.

10న గురు పౌర్ణమి వేడుకలు

కొలిమిగుండ్ల: గురుపౌర్ణమి సందర్భంగా ఈనెల 10వ తేదీ స్థానిక షిర్డీసాయి బాబా ఆలయంలో వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు షిర్డీసాయి సేవా ట్రస్ట్ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ గ్రామాలకు చెందిన భజన బృందాలు సాయి గీతాలు ఆలపిస్తారని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ గాయకుడు డాక్టర్ రవీంద్రబాబు బృందం భక్తి గీతాలు పాడుతారన్నారు. ఎర్ర సింధూరం యాడబాయ తల్లీ నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. సేవా ట్రస్ట్ చైర్మన్ వీడీ రాజగోపాల్ రచించిన మానవత్వం నిలుపుకో పుస్తకావిష్కరణ జరుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయి కళాకారులతో నాటక ప్రదర్శన ఏర్పాటు చేశామని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

బేతంచెర్ల: పట్టణంలోని 12వ అంగన్‌వాడీ కేంద్రం మరియు సిమెంట్‌నగర్ గ్రామంలోని 3వ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డోన్ ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్ బేగం సూచించారు. బేతంచెర్ల కేంద్రానికి ఓసీ జనరల్, సిమెంట్ నగర్ కేంద్రానికి ఎస్సీ–2 కేటాయించినట్లు తెలిపారు. దరఖాస్తు చేయదలచిన వారు ఆయా కాలనీలకు చెందినవారై ఉండాలని చెప్పారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 01-07-2024 నాటికి 21 నుంచి 35 ఏళ్లలోపు మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 10వ తేదీలోగా సమర్పించాలని తెలిపారు.

నేడు లేజర్ రన్ ఎంపిక పోటీలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి అవుట్ డోర్ స్టేడియంలో శనివారం నంద్యాల జిల్లా స్థాయి సబ్ జూనియర్, సీనియర్ బాల బాలికల విభాగాల్లో లేజర్ రన్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మోడరన్ పెంటథాలన్ అధ్యక్షుడు పృథ్వీ, కార్యదర్శి తిరువీధి నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు రూ.50 ప్రవేశ రుసుం చెల్లించి పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 7658933261 నంబరును సంప్రదించాలన్నారు.

ఉపాధి హామీ సిబ్బందిపై వేటు

కొలిమిగుండ్ల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగులపై ఉన్నతాధికారులు శుక్రవారం సస్పెన్షన్ వేటు వేశారు. వివరాలిలా ఉన్నాయి.. ఇటీవల కల్వటాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మాబు విందు ఇవ్వడంతో పని వేళలోనే ఈసీ చిన్న రంగయ్య, టీఏ ఓబులేసు, కంప్యూటర్ ఆపరేటర్లు పెద్దయ్య, నరేష్‌తో పాటు బెలుం శింగవరానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు. అక్కడ మద్యం సేవించి, విందు ఆరగించారు. అంతటితో ఆగకుండా ఉపాధి హామీ పనుల్లో అక్రమాల గురించి పూర్తిగా చర్చించారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ కావడంతో చర్చనీయాంశమైంది. సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ తీసుకున్నారు. విచారణ చేసి నలుగురు ఉద్యోగులతో పాటు కల్వటాల, బెలుం శింగవరం ఫీల్డ్ అసిస్టెంట్లను పీడీ సస్పెండ్ చేశారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ నరసింహులు

డోన్: చట్టవ్యతిరేకంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ప్రైవేట్ క్లినిక్‌లు, నర్సింగ్ హోంలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డీఓ నరసింహులు హెచ్చరించారు. సెంటర్లు సీజ్ చేయడమే కాకుండా యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రీ కాన్సెప్షన్ అండ్ ప్రీనటల్ డైగ్నోస్టిక్స్ టెక్నిక్స్ (PCPNDT) యాక్ట్ పరిరక్షణలో భాగంగా మల్టీ మెంబర్ అడ్వైజరీ అథారిటీ కమిటీ సమావేశం శుక్రవారం డోన్ ఆర్‌డీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ.. నర్సింగ్ హోంలు, స్కానింగ్ సెంటర్లు తమ లైసెన్సులు కాలపరిమితి ముగిసిన వెంటనే రెన్యూవల్ చేసుకోవాలని తెలిపారు. చట్టవిరుద్ధంగా స్కానింగ్‌లు జరుపుతున్న సెంటర్లకు ముందుగా నోటీసులు జారీ చేసి, ఆ తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆరోపణలు రుజువైతే ఆసుపత్రులను మూసివేయడమే కాకుండా రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామన్నారు. కమిటీ చైర్మన్ డాక్టర్ చెన్నకేశవులు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో రేడియాలజిస్ట్ డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ సలీమా, న్యాయవాది మధుసూదన్‌రెడ్డి, సామాజిక కార్యకర్తలు మహమ్మద్ రఫీ, ఏఈ నాగరాజు, మధు, డిప్యూటీ హెల్త్ అధికారి రాఘవేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

సమస్యలపై ఆర్టీసీ కార్మికుల నిరసన



డిపో ఎదుట నిరసన తెలియజేస్తున్న కార్మికులు

డోన్ టౌన్: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ డోన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు సీతారామిరెడ్డి, ఐవీఆర్ రెడ్డి, రీజినల్ కమిటీ సభ్యుడు రమణారెడ్డి డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం తెల్లవారుజామున విధులకు హాజరయ్యే సమయంలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు, బకాయిలు ఇవ్వాలని కోరారు. డబుల్ డ్యూటీలు చేసే సిబ్బందికి ఇచ్చే డీడీ అమౌంట్‌లను పెంచాలని డిమాండ్ చేశారు. కాలం చెల్లిన బస్సుల బ్రేక్ డౌన్‌కు గ్యారేజ్ సిబ్బందిని బాధ్యులను చేసి అక్రమ చార్జ్‌షీట్లు ఇచ్చే విధానాన్ని నిలుపుదల చేయాలని కోరారు. యూనియన్ నాయకులు మౌలాలి, నాగేంద్ర, చంద్ర, ఇస్మాయిల్, ఓబులపతి, హుస్సేన్, రాముడు పాల్గొన్నారు.

గొప్ప పోరాట యోధుడు అల్లూరి



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లలిత

బనగానపల్లె రూరల్: బ్రిటిష్ వారిపై వీరోచితపోరాటం చేపట్టి స్వాతంత్ర్య జ్యోతిని వెలిగించిన గొప్ప వీరుడు అల్లూరి సీతారామరాజు అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ బడే సాహెబ్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. అల్లూరి బ్రిటిష్ పాలకుల దోపిడి, అన్యాయాన్ని ఎదిరించి దేశ ప్రజల స్వేచ్ఛ కోసం పోరాటం సాగించిన భరతమాత ముద్దుబిడ్డ అని కొనియాడారు. అనంతరం అల్లూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అధ్యాపకులు సూర్యనారాయణరెడ్డి, వసుంధరమ్మ, సుధాకర్‌రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, రామకృష్ణ, సీతమ్మ, వరలక్ష్మీ, చంద్రకళ, రవికుమార్ పాల్గొన్నారు.

దేశ నాయకులను స్మరించుకోవాలి

బేతంచెర్ల: స్వాతంత్ర్య ఉద్యమంలో దేశం కోసం పోరాడిన నాయకులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శులు ప్రదీప్, మధు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు, పింగళి వెంకయ్య, దొడ్డి కొమరయ్య చిత్రపటాలకు నివాళులర్పించారు.

అల్లూరి, స్వామివివేకానంద జీవితాలు ఆదర్శం

బేతంచెర్ల: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ నాయకులు నాగ మోహన్, మధుమోహన్ రెడ్డి, ధర్మారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో అల్లూరి, స్వామి వివేకానంద చిత్రపటాలకు నివాళులర్పించారు.



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

వాసవీ మాతకు
విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో వెలసిన వాసవీమాతకు ఆషాడ మాసం రెండో శుక్రవారం సందర్భంగా ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆయా కాలనీలకు చెందిన వాసవీ మహిళా మండలి సభ్యులు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారిశాలకు చేరుకున్నారు. అమ్మవారికి చీరె, సారె సమర్పించి సామూహిక కుంకుమార్చన చేశారు.